# పొద్దుతిరుగుడు పూలు

ఎమ్బీయస్



నిరాశలా చీకటి.

చీకటిని చీలుస్తూ మనిషిని బతికించే ఆశలా కారు హెడ్‌లైట్.

చెట్టు చుట్టూ పురుగుల భ్రమలో, భ్రమణంలో.

ఆలోచనల్లా కారు వేగం.

ఆచరణలో తగిలే ఎదురుదెబ్బల్లా సడెన్ బ్రేకులు, విసిరికొట్టిన బంతి పైకిలేచినట్లు మళ్ళా వేగం. అంతలో ఓ మలుపు.

కారులో జీవితం చుట్టూ పరిభ్రమిస్తున్న నలుగురు ప్రయాణీకులు, డ్రైవరుకాక.

డ్రైవరు దేవుంది; లోకాన్ని నడిపించే శక్తి లాటివాడు. తనూ ప్రయాణం చేస్తాడు కాని ప్రయాణీకుడు కాదు. ఫ్రంట్ సీట్లో ఠీవిగా కూచున్నాయన నరసింహం, గవర్న మెంటాఫీసరు.

వెనకాల అటుకూచున్నాయన శేషశాయి, గుమాస్తా ఇటు కూచున్నతను ఆనంద్, నిరుద్యోగి.

మధ్యలో యినప్పెట్టెలా కూచున్నాయన కోదండం, కంట్రాక్టరు.

నరసింహం దర్జాగా కూచున్నాడు. ఆయన కనుబొమ్మల్లో అధికారం వుంది. మొహం నిండా గాంభీర్యం వుంది. నరసింహానికి నవ్వటం వొచ్చా-చెప్పలేం. నరసింహం మామూలు మనుషుల్తో మాట్లాడతాడా-కష్టం.

నరసింహం తాళికట్టిన పెళ్ళాంతోనే సరిగా మాటాడ్డు, మావగారితో ఎక్కువ మాటాడేవాడు పెళ్ళాంతోకన్నా. మావగారు రిటైర్డు సబ్ కలెక్టరు, బ్రిటిషు హయాంలో పై అధికార్ల మెప్పు పొందినవాడు. ఆయన తనకింద పనిచేసే యిండియన్లని హింసించి నందుకు ఒక దొర యింగ్లండు నించి ప్రత్యేకంగా తెప్పించిన టోపీ బహూకరించాడు నరసింహానికి. ఆ టోపీ అన్నా గౌరవమే.

ఉక్క పోస్తున్నా వులెన్ సూటేసుకున్నాడు. కంఠం దగ్గర్నించి కాళ్ళవరకు గాలి తగలకుండా గట్టిగా బంధించేశాడు. శరీరాన్ని "అవీజీ"గా వుంచడం వల్లనే "మెజెస్టీ" వస్తుందని కూడా నరసింహం నమ్మకం, ఆ "మెజెస్టీ" వల్లనే కదా శేషశాయి, ఆనందు, కోదండం వెనక సీట్లో సర్దుకుని తనకు ఫ్రంటు సీటిచ్చారు. నరసింహం ఎడంచెయ్యి గాలిలోకి వదిలేసి మరింత ఠీవిగా కూచున్నాడు.

శేషశాయి డోర్ పక్కన కూచున్నా ముడుచుకుపోయి కూచున్నాడు. గుమాస్తా వుద్యోగం చేసి చేసి ఎక్కడున్నా అతనికి ఎదురుగా, నెత్తిమీద, వీపుమీద ఫైల్సున్నట్టే వుంటుంది. సంవత్సరానికోసారి భార్య ముచ్చటగా సరస సంభాషణ చేసినా శేషశాయి బరువుగానే మాటాడతాడు. ఇంట్లో సరుకులసంగతో, పిల్ల పెళ్ళిసంగతో పిల్లాడిచదువు సంగతో, తల్లిజబ్బు సంగతో అయితే శేషశాయి ఎంత బరువుగా బాధగా కుంగిపోతాడో చెప్పలేం. ఉదయానే స్నానం ముగించి వంటింటో పొయ్యిపక్కనే వున్న దేవుడి మంటపంలో చెక్క ఫ్రేములో బంధించిన ఏడుకొండల వాడి గ్లేజుపేపరు స్పెషల్ ఫొటోముందు కూచున్న పది నిమిషాలు మాత్రం అతనికి బరువనిపించదు. కష్టాలు, బాధలు అన్నీ ఆ ఏడుకొండలవాడిమీద పారేసి తాను నిమిత్తమాత్రుడిలా గాలివాలుకి తేలిపోయే గడ్డిపరకలా కూచుంటాడు. శేషశాయి కళ్ళు తప్ప. వంటింట్లో మరో దిక్కు పోయే మార్గం కనబడక పొగంతా అతని కళ్ళలో నీరుగా మారుతుంది. కళ్ళు తుడుచుకుంటూ అతను పూజ ముగించిన ప్రతిసారి తల్లి శేషమ్మగారంటుంది "వాళ్ళ నాయనలాగే ఎంత భక్తో, వళ్ళు మరిచిపోతాడు వెంకన్న పేరు చెప్పగానే. ఈ కిటైనొక్కసారి కొండెక్కించరా నాయనా" అని. శేషశాయి "ఊ" అంటాడేమోనని శేషమ్మగారు పదేళ్ళు చూసింది. శేషశాయి కూడా "ఊ" అనేవాడే కాని, డబ్బెక్కడా వునులుబాటు కాలేదు. శేషమ్మగారు చూసి చూసి ఓ మొక్కు మొక్కి ముడుపు కట్టేసింది "మనవరాలి పెళ్ళి కొండమీద చేస్తానని" శేషశాయి భయంభయంగా కూచున్నాడు. ముందు సీట్లో, ఆఫీసరుగారివల్ల మానసికంగాను, పక్కనున్న కాంట్రాక్టరు గారివల్ల శారీరకంగాను కుంచించుకుపోయి ఆనందు నిరుద్యోగిగా ఆరేళ్ళ సర్వీసున్నవాడు. కళ్ళల్లో ఆశ చావలేదు, నీరసం కమ్ముకొచ్చినా. ప్రయాణాన్ని "ఎంజాయ్" చెయ్యాలి. అందులో చిన్నకారు ప్రయాణం జన్మకో శివరాత్రి. జీవితంలో ప్రయాణమన్నా అతని కందుకే యిష్టం. ఎంత "థ్రిల్లిం"ంటుంది. కొందరు సన్యాసులు కాళ్ళలాగి ప్రయాణం మధ్యలో ఆగిపోతుంటారు. ఆత్మహత్య చేసుకునే వాళ్ళంటే అతని కసయ్యం. ఆత్మ విశ్వాసం లేనివాళ్ళన్నా అంతే. ప్రతి దానికి, చివరకు పిల్లలు పుట్ట డానిక్కూడా దేవుడే కారణమంటారు; ఫూల్స్. ఆనందుకి దేవుడంటే మరీ కోపం. వుంటే కనబడమనవయ్యా, తన కీనాడో కష్టం వచ్చింది. వుద్యోగానికి పెళ్ళాలి. ఇలా వెళ్ళటం కొత్త కాకపోయినా యివాళ పేరు. నల భైలేందే ప్రయాణం లేదు. దేవుడిచ్చాడా —



ఇల్లు—ఇల్లాలు
చిత్రం : శీలం జయరామ్. మద్రాసు-1

తను కష్టపడి సంపాయించుకున్న మెడల్సమ్మితే వచ్చింది. లంచం ఇవ్వటం తన కిష్టంలేదు. లంచం లేకుండా ఉద్యోగం ఇవ్వడం ఎవరికీ ఇష్టంగా కనబడలేదు. నాన్నగారి గుర్తుగా భద్రంగా దాచుకున్న ఉంగరం ఇచ్చింది అమ్మ. అంత తక్కువ లంచంతో దైవ దర్శనం కూడా కాదు. అమ్మదో పిచ్చి. దేవుడి దయవల్లే అంతా చల్లగా జరిగిపోతుందంటుంది. కష్టపడి తెలివితేటల్తో సంపాయించుకున్న మెడల్సు, నాన్నగారి వుంగరం అమ్మకో వాల్సి రావటమా దేవుడి దయ;

ఆనందు కేర్‌లెస్‌గా కూచున్నాడు. ఈ ప్రయాణం ఎలా ముగుస్తుందో అంతా తనకు తెలుసన్నట్లు, తెలిసినట్లు.

కంట్రాక్టరు కోదండం నిండుగా కూచున్నాడు ఇద్దరిమధ్య. ఫ్రంటు సీట్లో కూచోవాలని, డోరు పక్క కూచోవాలని అతనికి పట్టింపులేదు. వెధవ శరీరం ఎక్కడుంటే జరిగిపోదు; చేతిలో లెదర్‌బ్యాగ్ గుండెలకు హత్తుకుని కూచున్నాడు కోదండం. అసలు మధ్యలో కూచుంటేనే మంచిది. డోర్ పక్కయితే ఎవడన్నా తేలిగ్గా బ్యాగ్ కొట్టెయ్యొచ్చు. గాల్లేకపోతే మాత్రం మధ్యలో వున్న సేఫ్టీ మరెక్కడా వుండదు. కోదండానికి లెదర్‌బ్యాగ్ ముఖ్యం. భార్య సీతారత్నానికి భర్త ఆరోగ్యం ముఖ్యం. ఆరోగ్యాన్కేవుంది వెధవది, డబ్బులు పారేస్తే

వందమంది డాక్టర్లొచ్చి పళ్ళుకూడాతోమి బాగుచేసి పోతారంటాడు కోదండం. అలాగని పారేస్తాడనికాదు. కాని కోదండం చేతికి ఒకోసారి ఎముక వుండదు. భార్యకాని, పిల్లలుకాని తన పనికి తన సంపాదనకి అడ్డంవచ్చి అక్కడికి తీసుకెళ్ళు, ఇక్కడికి తీసుకెళ్ళు అన్నప్పుడు కోదండం డబ్బుకి లెక్కచెయ్యడు. రెండు చేతులా విరజిమ్మేసి మీరే వెళ్ళండి, మీరే చూడండి అంటాడు. పిల్లలు అలవాటుపడిపోయారు కాని, సీతారత్నానికి కిటికీల్లేని 'ఇల్లే స్వర్గమయిపోయింది. నాలుగు చేతులా సంపాయించేప్పుడు రెండు చేతులా ఖర్చుపెట్టడానికి కోదండం జంకడు. రెండు చేతులా ఖర్చుపెట్టా లనుకున్నప్పుడు నాలుగు చేతులా సంపాయించడానికి కూడా వెనకాడకూడదని కోదండం అభిప్రాయం.

"పది నిమిషాలు కారాపి టీ యేసుకుందారండి. మళ్ళీ వంద మైళ్ళ లోపున దీపం కనబడదు." అన్నాడు డ్రైవరు, కారాపే ముందు ప్రయాణీకుల అభిప్రాయం కనుక్కోటం ముఖ్యవన్నట్లు.

"ఆపావు, వందమైళ్ళదాకా కాఫీలేకుండా ఎవడాగుతాడు." ఆనందు తెగిన చెప్పు వుంగటాన్ని కష్టపడి సరిచేశాడు దిగటానికి సన్నాహాలు చేసుకుంటూ.

"ఆలస్యమైతే ఆరింటికి చేరగలమో లేదో" అనుమానం ప్రకటించాడు శేషశాయి.

"టైమెంతయిందండి" ఆనందు కోదండం చెయ్యి పట్టుకున్నాడు వాచీ చూడడానికి.

కోదండం చేతిని లెదర్ బ్యాగ్‌కి బిగించి పట్టాడు ఆనందుమీద అనుమానపడి.

కోదండం భయం గ్రహించి "టైమ్ కోసమండి" అన్నాడానందు తన నిజాయితీ తెలియజేస్తూ.

"ఒంటి గంట" అని చెప్పాడు కోదండం అతి కష్టంమీద ముళ్ళు గుర్తుపటి.

"అబ్బో గవర్నమెంటు బస్సోళ్ళ స్పీడులో యెల్లినా ఆరింటి కెల్లిపోతాం"

"వెళ్తావనుకో! బస్సులాగా ఎక్కడా చెడిపోకుండా వుండాలిగా."

అంతా ఆనందుని శకునపక్షి వీడెక్కడ దొరికాడన్నట్టు చూశారు.

"స్పెషల్ కాఫీ దొరుకుతుందా" కోదండం అడిగాడు.

"ఇక్కడ దొరకంది లేదండి"

"అంత పేరు మోసిన వూరా"

ముందు సీట్లో ఆఫీసరుగారు మాట్లాడతారేమో తన అభిప్రాయం చెప్పచ్చునని చూశాడు శేషశాయి. నరసింహం మాటాళ్ళేదు,

డ్రైవరు టీ కోట్టు దగ్గర కారాపాడు,

ఆనందు గభాల్న దిగేశాడు కారాగగానే. అతని ఉత్సాహం అంగీకరించనన్నట్టు చెప్పు వుంగటం మళ్ళా జారిపోయింది. అలాగే ఈడుస్తూ టీ కొట్టు చేరాడు. కోదండం కారు దిగి తిమ్మిరెక్కిన కాలు జాడిస్తూ లెదర్ బ్యాగ్ మరింత గట్టిగా పట్టుకుని ముందుకు సాగడం నరసింహం దిక్కపోవటం చూసి "తమరు కాఫీ పుచ్చుకుంటారా?" అన్నాడు శేషశాయి, కారు దిగి ఫ్రంటు సీటు దోరు వక్కన వంగిపోయి.

"ఊ" అన్నాడు నరసింహం గంభీరంగా.

కోదండం, ఆనందు లోపలి కెళ్ళి బెంచి దులుపుకుని కూచున్నారు.

"కారు దగ్గరికి మంచి కాఫీ ఓ అరకప్పు చేసిఇయ్యి నాయనా" అన్నాడు శేషశాయి.

క్లీనర్ సర్వరుగా మారి కాఫీ తెచ్చి శేషశాయి కిచ్చాడు.

"కారు దగ్గిరివ్వరా యెదవా. యెదవాని" డ్రైవరు కోప్పడ్డాడు.

"ఎందుకూ! నేనిస్తాలే. మరో అరకప్పు కాఫీ లైట్‌గా చెయ్యి, పంచదార ఎక్కువేసి."

"గుమ్మస్తాగారూ! ఆయన మీ ఆఫీసరా" అన్నాడు ఆనందు. శేషశాయి కంగారు చూసి.

"కాదనుకోండి, కాని గవర్మెంటాఫీసరు గదా" అంటూ చెయ్యి కాలుతున్నా కాఫీ వొలక్కుండా జాగ్రత్తగా కారు దగ్గరికి చేరాడు శేషశాయి.

కాఫీ అందుకుని విలాసంగా సిప్‌చేసిన నరసింహానికి డ్రైవరు రౌడీల్లాటి మనుషుల్తో మాట్లాడుతుండటం నచ్చలేదు. ఎర్రజేబురుమాళ్ళ మెడమీద వేసుకుని బనీను లేకుండా తిరిగే రౌడీ వెధవలంటే ఆయనకి మంట. అలాటి వాళ్ళతో తన డ్రైవరు మాట్లాడతాడా? అలాటి డ్రైవరు కార్లొ తను ప్రయాణం చేస్తాడా? అదే ఆఫీసు కారయితే డ్రైవరుకి అక్కడికక్కడ పూస్టింగార్డర్లిచ్చేవాడు. కాని కిరాయి కారయిపోయింది.

శేషశాయి గ్లాసు వుత్తరీయంతో పట్టుకుని కాఫీ వూదుకు తాగుతున్నాడు.

"ఇది స్పెషల్ కాఫీయా! ఇలా తగలడిందే" అని క్లీనర్ కమ్ సర్వర్ని కోప్పడ్డాడు కోదండం,

"స్పెషలంటే గ్లాసు కడిగుంటాడు. అంతేకదూ సర్వేశ్వర్రావ్" అన్నాడు ఆనందు, యిందాక తన శీలాన్ని శంకించినందుకు కోదండాన్ని వుడికించాలని.

నరసింహానికి ఈ ముగ్గురి వరసా నచ్చలేదు. అలగా మనుషులు, అలగా పన్లు అనుకున్నాడు. టాక్సీ ఎక్కేముందే తోటి ప్రయాణీకులు ఆఫీసర్లో కాదో చూసుకుని ఎక్కటం అలవాటు. కాని అవాళ టాక్సీల క్కరువొచ్చింది. 'ఈ డ్రైవరు ఆరింటికి చేర్చేట్టు లేడు."

* * *

ఆరింటికి వెళ్ళిపోతే, తను కలుసుకోవలసిన వ్యక్తులు ఇళ్ళదగ్గరే దొరికితే, ఆనుకున్న పని అనుకున్నట్టు జరిగితే...

కారులో వున్న నలుగురి కోరికా అదే.

ఆలొచనలు వేరు, ఆశలు వేరు, ఆచరణ విధానాలు వేరు.

నరసింహానికి ప్రమోషన్ కావాలి. హైదరాబాదులో పై అధికార్లను మంచి చేసుకుని పని పూర్తిచేసుకోవాలి, తనకన్నా ముందు ప్రమోషన్ రావాల్సినవాడు రాజేశ్వర్రావున్నాడు, కాని తనకే రావాలి. తన హోదా! వెహారదక్షత మరొకరికుంటుందా. తనకే ప్రమోషన్ వస్తే తరతరాలుగా తన వంశంలో అందరికంటె గొప్పవాడవుతాడు. మా వంశంలో నరసింహంగారు అంత పెద్ద వుద్యోగం చేశారని తరువాత వాళ్ళు చెప్పుకుంటారు. తన వంశం అన్నమాటేవిటి, మావగారు తప్ప భార్య తరపు వాళ్ళు కూడా ఎవరూ అంత పెద్ద హోదాలోకి పోలేదు.అందుకేతనబావమరుదులంతా తనకి లోకువే. అలాటి వాళ్ళకి అప్పగారు కాబట్టి పెళ్ళాంకూడా లోకువే. తన కొడుకులు కూడా తనంత కావలసినవాళ్ళే. కాని దానికడుపున పుట్టబట్టి అనుమానం. నరసింహానికి ఆక్రమించబోయే పదవి. ప్రతిష్ఠ కళ్ళక్కనబడుతున్నాయి. ఆరింటికి చేరితే....

శేషశాయి ఊహలు రెక్కలు కట్టిన గుర్రాల్లా పరిగెడుతున్నాయి. పిల్ల సంబంధం ఖాయం చేసుకుంటే తనకెంతో బరువు తగ్గు

దీపావళి
శుభాకాంక్షలతో

విశాఖపట్టణం
జ్యూయలర్స్
అసోసియేషన్

తుంది. తల్లి సొద, భార్య సాధింపు, ఇరుగు పొరుగు మాటలు, తోటివాళ్ళ హేళన అన్నీ తగ్గిపోతాయి. తన పిచ్చిగాని అన్నిటికీ ఆ వెంకటేశ్వరుడే వున్నాడు. తప్పకుండా ఖాయం చేస్తాడు. కొండమీద పెళ్ళి చేస్తానని మొక్కుకున్నా చెయ్యడా? తాంబూలాలు పుచ్చుకుంటే ఇహ పెళ్ళి ఖర్చులు వెతుక్కోవాలి. కట్నం అక్కర్లేదన్నవాళ్ల ఖర్చుల కిబ్బంది పెడతారా. సంప్రదాయం మంచిదైతే చాలన్నారట. అలాటివాళ్లు ఈ రోజుల్లో ఎందరుంటారు. సంప్రదాయం మాటకొస్తే మాత్రం తన కుటుంబం మచ్చలేంది. అత్తగారితో పోట్లాటొచ్చి వంశాల గురించి ప్రస్తావించుకుంటూ "మీ వెధవ మేనత్త లేచిపోలేదా" అంటుంది భార్య, తనమీద విరుచుకుపడుతూ. సంప్రదాయం అంటే మగవాడి నీతి నిజాయితీ చూడాలి. తప్పకుండా ఒప్పుకుంటారు. కారు ఆరింటికి చేరితే....ఒక్క నిమిషం ఆలస్యమైనా ఒప్పుకోనన్నాట్ట పిల్లడి తాతగారు. ఆయనకి ముహూర్తాలమీద నమ్మకం.

ఆనందు ఆరోగ్యం మంచిదికాదు. చల్లగాలి తగిలితే జరం వొస్తుంది. విపరీతంగా దగ్గొస్తుంది. అయినా సరే, చిన్న కారులో వెళ్తా డోరు పక్కన కూచోటం, ఎవరన్నా తెలిసినవాళ్ళు కనబడితే స్టయిల్‌గా 'హాయ్' అనటం ఎంత ఆనందం? అందుకోసం కాస్త ఆరోగ్యం పాడయితే మాత్రం యేమిటి. ఈ వుద్యోగం కూడా రాకపోతే ఆరోగ్యంవున్నా వొకటే, పోయినా వొకటే. ఉద్యోగం రాకపోతే అమ్మ బాధపడుతుంది. రాలేదన్న బాధకి తోడు నాన్నగారి వుంగరం పోయిందని మరో బాధ. ఆ మహానుభావుడు ఆరింటికి వెడితేనే దొరుకుతాట్ట. ఆలస్యం అయితే హెలీకాప్టర్లో ఎగిరిపోతాడు కాబోలు. మరి మన సారథి, మనసచివుడు, మన నెయ్యుడు, మన డ్రైవరు చేరుస్తాడో లేదో....!

కోదండానికి ఆలోచనలేంలేవు. టెండరు కట్టాల్సిన డబ్బు చెయి జారకుండా భద్రంగా పట్టుకోడం ప్రధానం. మొక్కుబడి చెల్లించాల్సిన డబ్బు విడిగా ముడుపు కట్టి పెట్టుకున్నాడు. ఆరింటికి హైదరాబాదు చేరటం ఆలస్యం ఉత్సవ విగ్రహాల్ని దర్శించి ఆఫీసుకి చేరుకోవచ్చు. ఈ టెండరు చేతి కొస్తే లక్ష వెనకేసుకోవచ్చు. లక్ష రూపాయలు రావాలంటే ఆరింటికి చేరాలి.

ఈ ఆనందు గాడొకడు పై పని. అదని ఇదని బ్యాగ్‌మీద చెయ్యేస్తాడు. ఇలాటి వాళ్ళనో కంట కనిపెట్టాలి. ఆరింటికి చేరాలి.... కార్లో మెలకువగా వుండాలి.... టైము చాలా విలువయిందన్న మాట నలుగురి గుండెల్లో గంటలు కొడుతోంది. నాలుగంటల్లో మనం రాపోతే మరెవడెడతాడు హైదరాబాదు అన్నట్టు నడుపుతున్నాడు డ్రైవరు. కారులో వున్న నలుగురికి డ్రైవర్ని చావ చితగ్గొట్టి అవతలికి లాగేసి స్టీరింగు చేతిలోకి తీసుకుని యాక్సిలేటరు బలంగా తొక్కేస్తే-చిటికలో చేరిపోవచ్చు నన్న ఉత్సాహం ఉంది.

"టైమెంతయింది."

కోదండం వాచీ వున్న చెయ్యి దూరంగా పెట్టుకున్నాడు. ఆనందు మళ్ళా లాక్కుని మరీ చూస్తాడని.

శేషశాయికి చిన్న కునుకు పట్టింది.

అంతలో కల.

పెళ్ళికి కొండెక్కుతున్నట్టు వైభోగంగా పెళ్ళి చేస్తున్నట్టు. స్వామివారే పెళ్ళిపెద్ద. దగ్గరుండి జరిపిస్తున్నారన్నీ.

"ముహూర్తం దగ్గర పడింది శాస్త్రుల్లా" తొందర చేస్తున్నాడు పెళ్ళికొడుకు తాతగారు. ఈ ముసలాయనకి ముహూర్తం పిచ్చి. ఆనాడు తాంబూలాల కెళ్ళేరోజు ఆరింటికి రాకపోతే వొప్పుకోనని తనసెంత కంగారు పెట్టేశాడు. మంగళవాద్యాలు మిన్ను ముడుతున్నాయి. మధ్యలో అపశ్రుతి కీచుమని....

సడన్ బ్రేకుతో కీచుమన్న శబ్దంతో శేషశాయి కల్లోంచి లేచాడు.

"ఏం జరిగిందేం జరిగింది."

కంగారు. ప్రశ్నలు. ఆత్రుత. హడావడి.

డ్రైవరు దేనికీ పలకుండా కారు దిగాడు. బానెట్ లేపాడు.

"కారు చెడిపోలేదుకదా" ఆనందు కంగారు అణుచుకుందామన్నా పైకొచ్చేసింది.

"స్వామీ! ఆపద మొక్కులవాడా"

ఆనందు అనుమానం నిజమైనా అపశకునం పలుకుతున్నట్లు అనిపించింది కోదండానికి, నరసింహానికి.

ఆనందు కారు దిగి డ్రైవరు దగ్గర కెళ్ళాడు.

బానెట్ వాటున ఇద్దరూ ఏంచేస్తున్నారో ఎవరికీ కనబడటం లేదు.

"దొంగవెధవ లిద్దరూ యేకమవుతారా యేమిటి?"

కోదండం చేతులు లెదర్ బ్యాగ్ చుట్టూ బిగిసిపోయాయి,

"ముహూర్తం వేళకు చేర్చే భారం నీదే స్వామీ"

"గవర్నమెంటాఫీసరు కార్లో వున్నా డన్న జ్ఞానంకూడాలేదు. ట్రబులేదేనా వుంటే ముందే బాగుచేసుకోడవ కూడదూ? నరసింహానికి ఈ ఆలస్యం అంతా తన ప్రమోషన్‌కి అడ్డుపడుతున్న రాజేశ్వర్రావే చేయిస్తు న్నట్టనిపించింది.

"చిన్న ట్రబులొచ్చింది. పది నిమిషాల్లో బాగయిపోద్ది" డ్రైవరు హామీ ఇస్తున్నట్టు చెప్పాడు.

"బాగవుతుందంటావా" అన్నాడానందు మళ్ళా అనుమానంగా. "నీ వరస చూస్తే కారు చెడిపోవాలనుకుంటున్నట్టుందే" కోదండం ఆనందుమీద కసి తీర్చుకున్నాడు.

రెండయింది.

డ్రైవరన్నట్టు పది నిమిషాలే అయితే ఆరింటికి చేరే అవకాశం లేకపోలేదు.

"నామీద కోప్పడితే లాభం లేదు. కారు దిగండి. కాస్త గాలి పోసుకోవచ్చు." ఆనందు రోడ్డుమీదికి నడిచాడు.

డ్రైవరు బాటరీ లైటు పెట్టుకుని ఇంజను బాగు చెయ్యటానికి ప్రక్రమించాడు.

కోదండానికి అనుమానం కలిగింది.

అటూయిటూ కార్లొచ్చే జాడలేదు. కటిక చీకటి. ఈదురు గాలికి చెట్లు విపరీతంగా వూగుతున్నాయి రోద చేస్తూ. చుట్టూ చూశాడు కోదండం.

ఏదేశంలో వున్నదీ అంతుపట్టలేదు. పంచమైళ్ళ లోపున దీపం కనబడదని ముందే చెప్పాడు డ్రైవరు!

"అడవి మధ్యలోఆపేశాడు. ఏ దుర్బుద్ధీ లేకపోతే ఇలా చేస్తాడా. చక్కగాపోతున్న కారు సడెన్‌గా ఎందు కాగిపోయింది." కోదండానికి అనుమానాలు పెరుగుతున్నాయి.

"దోచుకోవాలనుకుంటే యింతసేపు చేస్తాడా. అయుండదు. డ్రైవరు మొహం చూస్తే మంచివాడిలాగే అనిపిస్తుంది. ఈ ఆనందు గాడిదే దొంగమొహం. మీదపడి మరీ వాచీ చూస్తాడు. వీడికీ వాడికీ వాటాలు కుదరక గొడవపడుతున్నారా."

"కోదండంగారూ! ఆ బ్యాగ్ కూడా





పాఠకుల ఆరాధ్య గ్రంథాలు:

యుద్దనపూడి సులోచనారాణి రచనలు

| | |
|---|---|
| * బంగారు కలలు | 6-00 |
| ఈతరం కథ | 12-50 |
| సెక్రటరీ | 7-50 |
| ఆశల శిఖరాలు | 7-50 |
| జీవన తరంగాలు 1వ భాగం | 10-00 |
| జీవన తరంగాలు 2వ భాగం | 10-00 |
| మీనా 1వ భాగం | 7-50 |
| మీనా 2వ భాగం | 7-50 |

మాదిరెడ్డి సులోచన రచనలు

| | |
|---|---|
| * అగ్ని పరీక్ష | 6-00 |
| * నిరీక్షణ | 6-00 |
| * నాతోపాటు నల్గురం | 6-00 |
| నాగ మల్లికలు | 6-00 |
| సంసార నౌక | 6-00 |
| ప్రేమలు-పెళ్ళిళ్ళు | 6-00 |
| శ్రీనిలయం | 6-00 |
| అద్దాల మేడ | 6-00 |
| పూల మనసులు | 7-50 |

కె. రామలక్ష్మి రచనలు

* ఆశకు సంకెళ్ళు 6-00
* ప్రేమించు ప్రేమకై 6-00
మూడో మనిషి 7-50
ఆడది 7-50

కొమ్మూరి వేణుగోపాలరావు రచన

* ఒకే రక్తం ఒకే మనుషులు 6-00

వడ్డెర చండీదాస్ రచన — హిమజ్వాల 15-00

శ్రీధర రచన — రాగ విపంచి 7-50

బీనాదేవి రచన — పుణ్యభూమీ కళ్ళుతెరూ 8.00

తారా - కొడవటిగంటి కుటుంబరావు 2-00

పాపం పసివాడు - గొల్లపూడి 3-00

రూ 20/- పుస్తకముల పైన పోస్టు ఖర్చులు ఉచితం. ముందుగా M. O. చేసిన వారికే పంపగలం. V. P. పద్ధతిలేదు.

* ఈ గుర్తుగల పుస్తకములు నూతన ప్రచురణలు

'నవభారత్ బుక్ హౌస్
ఏలూరు రోడ్డు • విజయవాడ-2

ఎందుకంటి చేతిలో-కార్లో పడేసి రండి."

"అదుగో బ్యాగంటున్నాడు దానిమీదే దృష్టి పడింది. వీణ్ని డ్రైవర్ని వంటరిగా వదలకూడదు." కారు దిగేవాడల్లా ఆనందు మాటతో ఆగిపోయి డోరు తెరిచిన వాడు తెరిచినట్టే వుండిపోయాడు కోదండం.

"పోన్లే రండి. అంత బంగారం దాచు కుంటే కార్లో పెట్టద్దులెండి. మీ ప్రాణానికి నా ప్రాణం అడ్డం."

"అరుస్తాదేవిటి రోడ్డుమీద నిలబడి దిగక పోతే వదిలేలా లేడు."

"శేషశాయి గారూ దిగండి" అన్నాడు కోదండం మరో మనిషి తోడుండటం ఎందుకేనా మంచిదని. శేషశాయి దిగి నర సింహం దగ్గరకొచ్చాడు.

"అయ్యా! కారు దిగండి. కాసేపు చల్ల గాలి తగిలితే ప్రాణానికి హాయిగా వుంటుంది."

"తను కారు దిగటమా, అందులో అలగా మనుషుల్తో మాట్లాడమా, ఈ నిరు ద్యోగి వెధవ నోటికి మరి అడ్డూ ఆపూ వున్నట్టు లేదు." నరసింహం కారు దిగ లేదు, శేషశాయికి జవాబు చెప్పలేదు. ఇంకా ఎక్కువ మాట్లాడితే ఆఫీసరుగారి క్కోపం వస్తుందేమోనని శేషశాయి కోదండం వెనకే నడిచాడు.

"కూచోండి గుమాస్తాగారూ! నేనూ కాబోయే గుమస్తానే. మనం మనం ఒకటే. కాస్త బతకటానికి పనికొచ్చే చిట్కాలు చెప్పండి" అన్నాడానందు రోడ్డుమీద నిశ్చింతగా జారగిలబడి కూచుని.

"చిట్కాలేవుంది. కంట్రాక్టర్ల దగ్గర లంచాలు పిండుకు తాగటం" అన్నాడు కోదండం గుమాస్తాలతో తను పడే కష్టాలు తలుచుకుంటూ.

"అందరూ అలాంటి వాళ్ళంటారనటం న్యాయం కాదండయ్యా."

"మీ లాంటి సత్తెకాలం మనుషులు నూటికో రుంటారండీ."

"కోదండంగారికి ..." మాట మధ్యలో దగ్గొచ్చింది. ఆపుకున్న కొద్దీ ఎక్కు వవడంతో శేషశాయి ఆనందు దగ్గరకొచ్చి మెల్లిగా గుండెలమీద రాశాడు.

"కోదండంగారికి కోపం రాదంటే ఒకటి చెబుతాను."

"కుర్రకారు మాటలక్కూడా కోపం తెచ్చుకుంటే మేం కాంట్రాక్టులు చేసినట్టే." ఆనందు గుండెలదుముకుంటూఅన్నాడు.

"శేషశాయిగారు పిల్లకి పెళ్ళి చెయ్యాలి. ఖర్చులకి నాలుగు వేలుకావాలి. మాట వర సకి చెబుతున్నాను."

"మాట వరసకేవిటి నాయనా! అక్షరాలా నిజం నాలుగు వేలు కాకపోయినా రెండు వేలయినా కావాలి."

"మంచిగా అడిగితే ఎవరిస్తారు. మీరి స్తారా?"

కోదండానికి మళ్ళా అనుమానం సెలవే సింది.

"పదినిమిషాలన్న డ్రైవరు అరగంట యినా తెవిలి ఛావడు. వీడేమో బ్యాగం టాడు. నాలుగువేలంటాడు. ఆ గుమాస్తా గాడు. సగం చాలంటాడు. మంచిగా అడిగితే ఎవరిస్తారు మీరిస్తారా అంటాడు. తన్ని లాక్కుంటారా యేవిటి." ఆఫీసరు గారుకూడా దగ్గరుండడంమంచిదనిపించింది కోదండానికి.

"ఆయన్ని కూడా పిలుస్తా" అంటూ జనాంతికంగా చెప్పి కారు దగ్గరికి వెళ్ళాడు.

నరసింహం బింకంగా కార్లో కూర్చున్నా డన్నమాటేగాని సూటు వేడికి ఒళ్ళంతా చెమటలు కారిపోతున్నాయి. దోమలొకటి, కాళ్ళలోకి దూరి మరీ కుడుతున్నాయి.

"కాసేపు అలా కూచుందాం రండి" అన్న కోదండం ఆహ్వానాన్ని కాదనకుండా కారు దిగాడు.

నరసింహం రావటం చూసి తను నిలబడి ఉత్తరీయం రోడ్డుమీద పరిచాడు శేషశాయి. నడి రోడ్డుమీద తను కూచోవలసి రావ టానికి కారణమైన కారుని, కారు డ్రైవర్ని తిట్టుకుంటూ ఉత్తరీయంమీద చతికిల బడ్డాడు నరసింహం.

"అవినీతి పెరిగిపోయి నిజాయితీ తగ్గి పోతే చూడండి ఎన్ని అనర్థాలొస్తాయో." ఆనందన్నమాటలో నరసింహానికి, కోదండా నికి సందర్భశుద్ధి కనబడలేదు. నన్ననటం లేదుకదా అన్న అనుమానం ఇద్దరికీ కలి గింది. తను పొరపాటున కారు దిగానను కున్నాడు నరసింహం. ఆఫీసరుగారితో మాట్లాడుతూ కారులోనే కూచోవలసింది అనుకున్నాడు కోదండం.

"కారు సంగతే చూడండి డ్రైవరు పాపం మొన్ననే బాగుచేయించాట్ట వంద రూపాయలు ఖర్చుపెట్టి. ఆ గేరేజీలోవాళ్ళు ఏంమోసంచేశారోమళ్ళా ట్రబులొచ్చింది." కోదండం టైము చూసుకున్నాడు.

మూడుం బావయింది. కారాగిగంట దాటింది.

"రెండున్నర గంటల్లో వెళ్ళగలమా" అని నరసింహంతో అన్నాడు కోదండం.

"వందమైళ్ళ స్పీడులో వెడితే వెళ్ళొచ్చు డైరెక్టుగా స్వర్గానికి."

కోదండానికి ఆనందు మాటలు వింటున్న కొద్దీ చీమలు కుడుతున్నట్టుంది."

"చీమలు కుడుతున్నాయి."

"అవున్నచోట పాములుకూడా వుంటా యిట."

ఆ మాటతో శేషశాయి నిటారుగా నిల బడ్డాడు "స్వామీ! వెంకటేశా" అను కుంటూ.

"పాములంటే నాకూ భయమేననుకోండి కాని, మాంఛి నల్ల తాచు ఎంతబావుంటుందో తెలుసా దర్జాగా...."

ఆనందు మామూలుగా చెబుతున్నా ఆమాటలు వింటుంటే తాచుపామును చూస్తున్న అనుభూతే కలిగింది ముగ్గురికీ.

"ఈ ఆనందుగాడు కావాలని భయపెడు తున్నాడా!

"ఆఫీసరుగారూ! అలా దూరం నడుద్దాం పదండి" అన్నాడు కోదండం ఆనందుకి దూరంగా వుండటమే మంచిదని.

నరసింహం లేచాడు కోటు నలక్కుండా కాళ్లు నెప్పెట్టకుండా కూచోటం కంటె నడ వటమే హాయిగా వుంటుందని.

గడియారం చప్పుడు పది రెట్లెక్కువై వినబడుతోందాయనకి. హైదరాబాదు చేర నట్లే లెక్క. రాజేశ్వరావుకే ప్రమోషను.

"మూడున్నరయినా డ్రైవరు ఏ సంగతీ చెప్పడే" అన్నాడు కోదండం, ప్రతి సెక నుకీ వాచ్ చూసుకుంటూ.

ఆనందు శేషశాయి వున్న చోటుకి పదడుగుల దూరంలో, అడుగులో అడు గుతో నడుస్తున్నా రిద్దరూ.

"శేషశాయిగారూ! మీ రెన్నయినా చెప్పండి తాచుపాములకంటె మనుషులే డేంజరంటాను. దొంగలున్నా రనుకోండి. డబ్బో దోచుకుంటారు. ప్రాణాలూతీస్తారు. తాచుపాము సామాన్యంగా తలొంచుకు పోతుంది మనదారి కడ్డురాకుండా. మనుషుల్లో దుర్మార్గులు, పెద్ద మనుషుల్లా వుండే దొంగ వెధవ లున్నారనుకోండి వాళ్ళు ఒక్కొ క్కరూ పదేసి తాచుపాములు, ఒక్కొ క్కరూపదేసి చొప్పున ఒకో వూళ్ళో పది

మందుంటే వంద పూళ్ళకి ఎన్ని తాప పాము లంటారు."

ఆనందు మాటలు శేషశాయి వినటం లేదు. కాని నరసింహానికి, కోదండానికి వినబడ్డాయి. ఇద్దరూ ఒక్కసారే ఆగి పోయారు. అడుగు పడలేదు. భయపడి ఆగి పోయామనుకుంటారేమో నని రెండడుగులు ముందుకేసి ప్రకృతి సౌందర్యం చూస్తున్న పోజులో నిలబడిపోయారు.

ప్రకృతి యేవంత ఆకర్షణీయంగా కనబడడంలేదు. దొంగ వెధవ నల్లగుడ్డ కళ్ళకట్టుకున్నట్టుంది చీకటి. మెరుస్తున్న పిల్లి కళ్ళలా మినుకు మినుకు మంటున్నాయి నక్షత్రాలు.

చెట్లు కదుల్తున్నాయి. ముందుకొస్తున్నట్టు కూడా వున్నాయి. చెట్ల చాటునుంచి నక్కినక్కి పొంచిపొంచి దొంగలు, గూండాలు వేనకువేలు.... ఈదురుగాలి రొద. ఎవరితోనో పోట్లాడుతున్నట్లు. "ఇన్నాళ్లా పుచ్చుకున్న లంచాలన్నీ కక్కు. ఎక్కడ దాచావ్ డబ్బంతా."

"కంట్రాక్టుల్లో మోసం చేసి దాచిన డబ్బంతా రానీ-యే గోడవున్లో పారేశావదంతా!

గాలిలో కనబడని గడుసు దయ్యాలు మీదమీద కొచ్చి ప్రశ్నిస్తున్నట్టే వుంది నరసింహానికి, కోదండానికి.

శేషశాయి రెండు చేతులెత్తి దణ్ణం పెట్టుకున్నాడు.

"స్వామీ! ఏమిటీ పరీక్ష."

"వాటికి దణ్ణం పెట్టుకుంటే ఏమవుతుంది. డ్రైవరుకు దణ్ణం పెట్టండి త్వరగా బాగు చెయ్యమని. లేదా కాసేపు ప్రకృతిని ఆరాధించండి. ఇదే వెన్నెలయితేనా-అంతటా ఇసక-ఇసకలో అంచల్లా..."

ఆనందు దగ్గుకుంటూ చెప్పిన మాటలు సగం సగం వినబడుతున్నాయి దూరానికి.

"ఇసకకేవిటి! సిమెంటుకూడా కలిపే వాణ్ణి." కోదండం గొంతు గురగుర లాడింది.

"లంచాల్లేకుండాకూడా పన్లు చేసేవాణ్ణి." నరసింహం మాటకంఠంలో సుడి తిరిగింది.

ఆనందుకి దగ్గు ఎక్కువయింది. నిలబడలేక, కూచోలేక అవస్థపడసాగాడు. చల్లగాలి తగిలి జరంకూడా రావటంతో అర్థం పర్థంలేని వాగుడు మొదలెట్టాడు. కోదండం మూడున్నరయిందన్నప్పుడే వుద్యోగం ఆశ పోయింది.

"వుండండి! ఎంత వరకయిందో చూసొస్తా" కారు దగ్గరకి బయల్దేరాడు.

కోదండం వెనక్కొచ్చి ఆనందు చెయ్యి పట్టుకుని ఆపేశాడు. డ్రైవరుతో కలిస్తే మళ్ళా గుసగుస లాడతాడేమోనని.

"తొందర పడితే అవుతుందటయ్యా! కూచో."

"ఇంక కూచో లేనండి. నడిచయినా వెళ్ళిపోతాను."

డ్రైవరు రావడంచూసి ఆగిపోయాడానందు.

అంతా ఆశగా చూశారు. ఆత్రుతగా చూశారు.

"లాభం లేదండి. నా వల్ల కాటం లేదు."

నలుగురికీ గొంతెండిపోయింది ఆ మాట వినగానే నాలుగయి పోతోంది. కారు బాగవలేదు. అయినా ఆరింటికి చేరే ఆశలేదు.

"మళ్ళీ చూడవోయ్! నీక్కావలిస్తే గవర్నమెంటులో వుద్యోగం ఇప్పిస్తాను."

"పది రూపాయలెక్కువిస్తానుతొందరగా చూడు బాబూ"

"ఆ వెంకన్నని తలుచుకుని మరొకసారి చూడు నాయనా."

"వెంకన్నేం చేస్తాడండి మధ్యలో,ఇంజనంతా పదిసార్లు చెక్ చేసే వుంటాడతను."

"చేశానండి. ఫాల్టేంటో కూడా తెలీటం లేదు."

నలుగురూ ఆశ వదులుకున్నారు.

ఆరింటికి చేరటం కల్ల.

ప్రమోషన్ రాదు.

పెళ్ళికాదు.

కాంట్రాక్టు చిక్కదు.

వుద్యోగం దక్కదు.

అందరికీ వెర్రి చూపు పడింది జీవితం పట్ల ఏ ఆసక్తీలేనట్లు.

"మరో డ్రైవరెవడేనా ఒస్తే చాలండి. ఇద్దరం కలిసి పట్టు పట్టేంస్తాం."

గంటనించి కారు ఆగివుంటే అటూ ఇటూ కూడా కారొచ్చినా జాడలేదు. మరో గంట తర్వాత బస్సేదైనా వచ్చినా ప్రయోజనం లేదు. చీకటి చీల్చుకుని రాగల ఆశా కిరణం కనబడటం లేదు.

పావు తక్కువ నాలుగు.

నిరాశ పెరిగినకొద్దీ ఉత్సాహం ఆరిపోసాగింది.

చలి తెలుస్తోంది.

చీకటి తెలుస్తోంది.

ఒంటరితనం తెలుస్తోంది.

అడవిలాటి ఆచోటువదిలి మళ్ళా జనాన్ని చూడగలమా అన్న భయం గడ్డ కడుతోంది.

పది నిమిషాల్లో వెళ్ళిపోతాం అనే ఆశలో కనబడని వన్నీ, రాని ఆలోచనలన్నీ ప్రస్తుతం ఇక్కణ్ణుంచి కదల్లేమని తెలిశాక కందిరీగల్లా ముసురుకుంటున్నాయి.

"లారీ వొస్తోంది" వెర్రికేక పెట్టాడు డ్రైవరు.

నలుగురూ ఎదురుగా కనబడుతున్న కాంతి కిరణాన్ని కళ్ళు పొడుచుకుని మరీ చూశారు.

లారీయో మరోటో వస్తోంది.

ఆపుతాడా.

ఆపినా అతను బాగుచెయ్యగలడా?

అసలు చెయ్యా లనుకుంటాడా?

ఆ లారీలో మరో నలుగురు గుండాలుండి వాళ్ళతో ఈ డ్రైవరు లాలూచీపడి-

"ఆనందూ! నలుగురం కలిసి లారీ ఆపుదాం" అన్నాడు కోదండం ఆనందుని మంచిచేసుకోవటం అవసరమని ఆలోచించి.

తోటి డ్రైవరు సాయంచేస్తాడన్న నమ్మకంతో రోడ్డుకి అడ్డంగా నిలబడ్డాడు డ్రైవరు.

లారీ ఆగింది.

డ్రైవరు లారీ దగ్గర కెళ్ళాడు మాట్లాడ్డానికి.

అత నేం కుట్రచేస్తున్నాడో అన్న అనుమానంతో కోదండం ఆనందు చెయ్యి పట్టుకుని లారీ దగ్గరికి లాక్కెళ్ళి డ్రైవరు వెనకే నిలబడ్డాడు,

"సూద్దాం పదండి" డ్రైవరు దిగాడు.

"రేయ్! బండిపక్కకి లాగి బ్రైట్ లైటు కొట్టు" అని క్లీనర్ని ఆజ్ఞాపించి కారువేపు నడిచాడు.

సూటేసుకుని ఠీవిగా నిలబడ్డా దిగాలుగా కనబడుతున్న నరసింహంమీద దృష్టిపడింది లారీ డ్రైవరుకి.

"దండాలు దొరగారూ."

నరసింహానికి అసలే నీరసంగా వుంది. అడ్డమైన లారీ డ్రైవరూ దండాలు పెట్టి పరువుతీసేస్తూంటే మరీ దిగులు కలిగింది.

"గుర్తెట్టే దట్టుంది అయ్యగారు."

నరసింహం యిరుకున పడ్డాడు, బింకం సడలించి మాటాడితే తేలికవుతానేమో, మాటాడకపోతే పొగరనుకుని సాయం చేయ్యడేమో.

"జగ్గయ్యపేటలో తమ దగ్గర పన్జేశావండి జీపు డ్రైవరుగా."

"నువ్వటోయ్" అన్నాడు నరసింహం అతనెంతో ఆప్తుడయినట్లు. కోదండానికి ధైర్యం కలిగింది, లారీ డ్రైవరు తెలిసిన వాడవటంతో.

"ఏడుకొండలవాడా! నువ్వే పంపించావా తండ్రీ".

శేషశాయి వేన వేల నమస్కారాలు పెట్టేస్తున్నాడు.

"బేగి రా గురో! ఓ పట్టు పట్టేద్దాం."

"ఉండు గురో! అయ్‌గారు శాన్రోజులి క్కానబడ్డారు. తవరిగ్గుర్తుందో లేదో తవరు టూర్లెల్లకుండా టియ్యేల్రాసుకుని నాకు మాత్రం ఎగ్గొడితే ఇదే టన్యాయమని నేనడిగాను. తవరికోపవొచ్చి వుద్యోగంలోంచి తీసేశారు."

నరసింహానికి గుండె ఆగినంత పనయింది. ఆ కోపం మనసులో పెట్టుకుని ఇప్పుడు కారు బాగు చెయ్యనంటాడా.

"రాజేశ్రావ్! నా శత్రు పక్షాన్ని ఎలా వుసిగొలుపుతున్నావురా".

"ఏదో అయిపోయిందిలే. నాకు ప్రమోషనొస్తుందిగా. మళ్ళీ ఉద్యోగం కావాలంటే రా! వేయిస్తాను."

"వొద్దులెండయ్ గారూ! లారీ మీదే బావుంది. నాలుగు డబ్బులు కళ్లజూడొచ్చు.

"రా గురూ! చూసేద్దాం."

"నా పేరు సింతాలు. తమరిగ్గుర్తుందో లేదో. కారు చూసేనివ్వండి ఆనక మాట్లాడుకుందారి."

నాలుగయింది.

ఎనభై మైళ్ళ స్పీడులోపోతే ఆరింటికి చేరచ్చు.

డ్రైవరు పోగలడుగాని కారు బాగవాలిగా ముందు.

చింతాలు తీవ్రంగా ఇంజను చూడటంలో మునిగిపోయాడు.

నలుగురూ చింతాలు చుట్టూ దడికట్టినట్టు నుంచున్నారు.

అతనుకూడా జారిపోతే మరి దిక్కు లేదు.

"చింతాలూ! నీ కుద్యోగం వేయిస్తాను. టూర్లు వెళ్ళకుండానే టియ్యే ల్రాసుకునే యేర్పాటు చేయిస్తాను. ఈ గండం గట్టెక్కించు."




"చింతాలూ వందరూపాయలిస్తాను. వంద కాదు నువ్వెంతడిగితే అంతిస్తాను. ఒందరుకి డబ్బు తక్కువయితే అక్కడెక్కడో చూసుకుంటాను. హైదరాబాదు చేర్చు."

"చింతాలూ! అమ్మాయి పెళ్ళికి కొండకెళ్ళినప్పుడు నీ పేర సహస్రనామార్చన చేయిస్తాను."

"చింతాలూ! నీకు నేనేం యివ్వలేను. నీ కెప్పుడే నా వుద్యోగంపోతే నీతరపున వెతికి పెడతాను".

"లాబం లేదండి. రెండు రేత్రుల్నించి నిద్దర్లేదు. బుర్ర పన్జెయటం లేదు.

చింతాలు కూడా జారిపోయాడు.

నరసింహం గవర్నమెంటాఫీసరు దర్పం వదిలేసి చింతాలు కాళ్ళు పట్టుకోవాలన్న కోరికతో సతమతమైపోతున్నాడు.

లెదర్ బ్యాగ్ చింతాలు కిచ్చేసి కట్టుగుడ్డలతోనైనా హైదరాబాదు చేరాలనుకున్నాడు కోదండన.

వెంకన్న లేడు. వుంటే యింత పరీక్ష చేస్తాడా. ఇంత హింసపెడతాడా. శేషశాయికి ఏడుకొండల వాడిమీద నమ్మకం సడలిపోయింది.

ఆనందుకి స్పృహ తప్పుతున్నట్టనిపించింది. మనిషిమీద నమ్మకం పోయింది. ఏడుకొండలవాడా నువ్వే దిక్కు అనుకుని ఆకాశంవంక చూస్తూ చేతులెత్తి నమస్కారం పెట్టేశాడు.

"ప్లాస్కులో టీ చుక్కుంది గురో" క్లీనరు పరిగెత్తు కొచ్చాడు.

చింతాలు ఆశ్చరపోయాడు టీ ఇంకా మిగిలున్నందుకు.

"నువ్వింఁదాక తాగలేదంట్రా ఎధవ" అని క్లీనర్ని ఆప్యాయంగా తిట్టి టీ తాగి గబగబా బీడీ దమ్ము లాగి ఇంజనువేపు తిరిగాడు.

అయిదు నిమిషాల్లో యింజను స్టార్టయింది.

"సూడు గురో! మల్లా అగటానికీ ల్లేదు"

నలుగురి మొహాలూ ఆనందంతో వెలిగిపోయాయి.

నరసింహం గబగబా వెళ్ళి ఫ్రంటుసీట్లో కూచున్నాడు. కోదండం లెదర్‌బ్యాగ్‌గట్టిగా పట్టుకుని వెనక సీట్లో మధ్యనే కూచున్నాడు.

ఆనందు చేతి మడతలో నాలుదు పదుల పక్కనవున్న రూపాయినోట్లు తీసి చింతాలు కిచ్చాడు. టీ తాగమని.

"బలేవోరే! అయ్యగారున్న కారు బాగు చేసి డబ్బు లుచ్చుకోవాలా."

నరసింహం మొహం గర్వంతో వెలిగిపోయింది.

"పరవా లేదులే వుంచవోయ్" అన్నాడు తన సొమ్మేం పోయిందని.

లారీ కదిలింది తోటి మనిషికి సాయం చేశానన్న గర్వంతో.

కారు కదిలింది మానవుడికి మానవుడు సాయపడ్డాడన్న కృతజ్ఞతతో.

తను గవర్నమెంటాఫీసరు కాబట్టే వాడలా శ్రమపడి బాగు చేశాడనుకున్నాడు నరసింహం మరింత ఠీవిగా కూచుంటూ.

తను డబ్బిస్తాననబట్టే వెర్రి వెధవ ఆశపడి బాగు చేశాడనుకున్నాడు కోదండం లెదర్ బ్యాగ్‌ని మరింత ప్రేమగా గుండెలకు హత్తుకుని.

ఏడు కొండలవాడే చింతాల్ని పంపించాడనుకున్నాడు శేషశాయి వెంకన్నకి మరో దణ్ణం పెట్టుకుంటూ.

మనిషికి మనిషి సాయబడాలి గాని దేవుడేం చేస్తాడు. అసలున్నాడా అనుకున్నాడానందు డోరు పక్కనే కూచుని చల్లగాలి ఆస్వాదిస్తూ.

ఆలోచనల్లా కారు వేగం.

ఆచరణలో తగిలే ఎదురు దెబ్బల్లా సడెన్ బ్రేకులు, విసిరికొట్టిన బంతి పైకి లేచినట్టు మళ్ళా వేగం. అంతలో ఓమలుపు.

దీపం చుట్టూ పురుగులు భ్రమలో, భ్రమణంలో. ★